కథానిక

# శాపంగా మారిన వరం

శ్రీనివాసుల శ్రీరామమూర్తి

జీవితంలో ఒకే ఒక కోర్కెను తీర్చుకోడానికి శక్తి చాలక సత్యమూర్తి తన ఏకైక కుమార్తె కామాక్షిని యెలాగో యింటర్ వరకూ చదివించేడు. సత్యమూర్తి చేసేది యెలిమెంటరీ స్కూలు మాష్టరు గిరీ. ఉన్న ఒక్క కొడుకూ పుట్టు గ్రుడ్డి. భార్య పెట్టిన పోరుతో తనకోర్కె ద్విగుణీకృతమైనా డబ్బులేకనే యిరవై రెండేండ్లు వచ్చినా కుమార్తెకు పెళ్లిచేయలేకపోయేడు. ఈ చాతకానితనానికి లోలోన ప్రతినిముషం యేడ్చుకున్నా భార్యవలె తేలిపోకూడదని పైకి గాంభీర్యాన్ని ప్రదర్శించేవాడు.

ఈమధ్య కామాక్షి వుద్యోగంలో కోరి ప్రవేశించింది. ఏపనీ పాటులేక ఒంటరిగా కూర్చుంటే కోర్కెలు అతీతంగా విహరిస్తుంటాయ్. అంతేకాకుండా యింటిపరిస్థితి యేమీ బాగుండలేదు. కంపెనీలో చేరినతరువాత యీయెడతెగని ఆలోచనలకి చాలవరకు స్వస్తి చెప్పగలిగే పరిస్థితికి వచ్చింది. అంతేకాకుండా ఆకుటుంబాన్ని యిక పోషించేది తనేనని కొద్దిరోజుల్లోనే తెలుసుకుంది. నాన్న వుద్యోగంసరి. తను ప్రవేట్లువల్ల తెచ్చేది జీవనానికి యేమాత్రం చాలదు. ఆయిల్లు నిలవాలంటే తను ఉద్యోగంచేస్తూ వుండవలసిందే. ఎంత సంతోషంగా వుద్యోగం చేద్దామన్నా ఆమెలో రేగిన కోరికలు విషావచ్ఛాయలు మనసులో కల్పించేవి. ఆమెతో చదివిన వాళ్లెందరో హాయిగా సంసారం చేసుకుంటున్నారు. అమ్మా అని పిలిపించుకొనే అదృష్టానికి నోచుకున్నారు. ఉండి వుండి "నా బ్రతుకింతేనా!" అని విసుక్కునేది. చంటివానికి పాలులేకపోతే తృప్తిలేదు. కొన్నాళ్ళకు అన్నం తినిపించాలి. జీవితంలో కనీసపు కోర్కెలకు మనిషి నోచుకోపోతే మనోవ్యధ తప్పదు.

అప్పుడే కామాక్షి ఆఫీసునుండివచ్చి బట్టలు మారుస్తూ వంటింట్లో తల్లిదండ్రుల సంభాషణ వింది. పెరట్లోకివెళ్లి కాళ్లూచేతులూ కడుక్కొని గదిలో వాలుకుర్చీలో కూర్చొని దినపత్రిక చదువుతూండగా తల్లివచ్చి కూతురుతో ఏవేవో విషయాలు మాట్లాడి వివాహవిషయం యెత్తింది.

"ఇప్పుడొచ్చిన తొందరేంటమ్మా" అంది తిరిగి పత్రిక చూస్తూ.

"మాగురించి నీ సుఖాన్ని చంపేసుకుంటావా తల్లీ. ఏదో నీ అభిప్రాయం తెలియజేయి ఒకటి, రెండు సంభంధాలు వున్నాయ్. చూస్తాం" అంది ప్రాధేయ పూర్వకంగా.

కామాక్షి మారు మాటాడలేదు. వయస్సు, సుఖం, అనేవి తలచుకుంటే ఒళ్లు జలదరించింది. ఎంతడబ్బు సంపాయించినా ఆడదానికి జీవిత సౌఖ్యం లేనిదే యీ ఆర్జన, యీచదువు నిరర్థకం. ఈ యౌవ్వనం కాస్త గడచిపోతే తనను వివాహం చేసుకొనేవారుంటారా? అనే సందిగ్ధావస్థలో పడింది. అవివాహితగావుంటే సంఘం దృష్టిలోకూడ కొంత కాలానికి ఒకఅల్పంగా కనబడవచ్చును. ఈదశలో తను వివాహంచేసుకొని తల్లి దండ్రులను విడిచిపెట్టడమా లేక వారికొరకు అవివాహితురాలుగావుండటమా అనే విషయాల్ని తనలో తను తర్కించుకుంటూ పత్రిక గుండెలపై విడిచి అలానే కుర్చీకి చేరబడింది. ఎన్ని ఆలోచించినా ఒక అంతిమనిర్ణయానికి రాలేదు.

సత్యమూర్తి ఒకటి, రెండు సంబంధాలు చూసేడు. అందులో కామాక్షితో చిన్నప్పటి నుండి చదువుతూ ఆమెతోపాటే ఇంటరు ప్యాసైన సత్యం-అనుకూలంగా వుంటాడని, అయితే సత్యాన్ని కామాక్షి చేపడుతుందా అనేదే ప్రశ్న. సత్యానికి కామాక్షి అంటే విపరీతమైన అభిమానం. కాలేజీలో చదువుతున్న రోజుల్లో సత్యం కామాక్షిని నీడవలె వెన్నంటేవాడు. అయితే ఆమెమాత్రం సత్యం ప్రేమను గుర్తించలేదు. ఆమెకు సత్యంపై ఒకరకమైన ఏహ్యభావం కలిగింది. సత్యం అందవికారుడని కాదు. తొలిచూపుల్లోనే కలిగిన ఆ విముఖత

సత్యాన్ని ఆమెకు దూరంచేసింది. సత్యం చదువులో ప్రథమతరగతికి చెందినవాడు. గుణాలలో ఉన్నతుడు. అయితే సత్యంపేరు కామాక్షికి కఠోరంగా వినబడుతోంది. ఎప్పుడైనా కలసినప్పుడు ఆప్యాయంగా సత్యం మాట్లాడినప్పుడు పనివున్నట్లుగా మాటలు తొందరగా ముగించుకొనిపోయేది. ఈ పరిస్థితుల్లో సత్యాన్ని యెలా వివాహమాడుతుంది?

కుటుంబం ఆర్థికపరిస్థితులు, ఆఫీసుకు నడిచి వెళ్లి వస్తూండడం, కామాక్షిని కొంతవరకు క్రుంగతీసేయ్. కాని ఆమె మంచినడవడి ఆమెకు కొంత బలాన్ని చేకూర్చింది. ఆనాడు ఆఫీసు మేనేజరు సెలవుల్లో వుండటానీ కామాక్షి ఆపని నిర్వర్తించవలసి వచ్చింది. తనపని తొందరగా ముగియటంమూలాన్ని ఆమె తీరికగా కుర్చీవరండాలో వేసుకొని ఐదోగంటకు నిరీక్షిస్తూ కూర్చుంది. పని లేకపోవడంచేత ఆఫీసు బంట్రోతు మేనేజరుగారు తనను యింటికి రమ్మన్నారని చెప్పి వెళ్ళిపోయేడు. ఇంక ఆఫీసులో శేషు, కామాక్షి మిగిలేరు.

శేషు, కామాక్షివున్న వరండాలోనికి వచ్చి "ఏమండీ రెండుమూడు దినాలనుండి అదోలా కనబడుతున్నారు. కారణం తెలుసుకోవచ్చా" అన్నాడు. తను తెచ్చిన ఫ్లాస్కునుండి కాఫీ కప్పులో పోస్తూ.

"ఏంలేదని" ముభావంగా వూరుకుంది.

సరైన జవాబు రానందున అనవసరంగా అడిగినందున క్షమాపణచెప్పి కాఫీకప్పు ఆమె ముందు వుంచేడు. కాఫీ తీసుకోకపోతే ఏమనుకుంటాడనే వుద్దేశంతో తీసుకుంది. ఏవేవో ఆఫీసు విషయాలు కొంతవరకు మాట్లాడినపిమ్మట "మీయిల్లు యెక్కడండీ" అన్నాడు.

"ఇక్కడికి అరమైలు దూరముందండీ" అంది దూరాన్ని తలచుకొని భయంతో.

"పాపం నడక చాల కష్టమే" అన్నాడు సానుభూతి కనబరుస్తూ.

"ఏం చేస్తానండి? దగ్గరలో యిల్లు దొరకలేను. దొరికినాయే ముప్పైరూపాయిలో యిచ్చుకోవాలి. అందుకనే ఎంత కష్టమైనా నడచివస్తూన్నానండి" అంది. తన కష్టాలను తెలియజేస్తూ.

"మా యిల్లూ దూరమేనండి. భట్రాజువారి వీధిలో" అన్నాడు తనవునికిని తెలియబరుస్తూ.

"అలానా! అక్కడను దగ్గరలోనే తూర్పుగా వుంది మాయిల్లు" అంది.

"అలానా మాకు దగ్గరలోనేనా" అన్నాడు చిరునవ్వుతో.

"మీ తల్లిదండ్రులు యిక్కడేనా" అని ప్రశ్నించింది.

"లేదండి మావారు బరంపురంలో ఉన్నారు ఒక్కడినే హోటల్‌లో భోజనం చేస్తున్నాను" అంటూ "మీకు యిచ్చట యెవరున్నారు?" అని తిరుగు ప్రశ్న వేశాడు.

"తల్లీ తండ్రీ, తమ్ముడూ నేను అంతే మా కుటుంబం. నా పరిస్థితి వేరులెండి" అని క్రింది పెదవి కఱచి విరక్తిగా తెలియజేసింది.

"ప్రతివారికి యేదో వుంటుందిలెండి దానికి అంతగా నిస్పృహచెంద నవసరంలేదు. నా పరిస్థితి అంతేనండి" అన్నాడు.

ఐదుగంటలయింది. ఆఫీసు స్వీపరు తలుపులు మూయగానే వీరు యింటికి బయలుదేరేరు. ప్రతిదినం ముందుగా సైకిలుమీద వెళ్లిపోయే శేషు, కామాక్షితో మాట్లాడుతూ కలసివెళ్లాడు వీధి చివరనుండే ఆనవాలుగా యిల్లు చూపెడ్తూ. "ఎప్పుడైన వస్తూండండని" చెప్పి వెళ్లిపోయింది.

శేషు యింటికివచ్చినతరువాత ఆమె విషయం ఆలోచించేడు. ఆమె వినయవిధేయతలు, ఆ ముఖవర్చస్సు శేషు హృదయాన్ని హత్తుకొనిపోయేయ్. ఆమె అభిమానాన్ని సంపాయించాలనే వుబలాటం అధికమైంది.

ఆదివారం ఉదయం కామాక్షి ఆహ్వానంపై ఆమె యింటికి వచ్చేడు వీధిలో నిల్చొనివుండగా సత్యమూర్తి చూసి ఓహో శేషగిరిరావుగారా దయచేయండని ఆహ్వానించేడు. శేషుకి ఆశ్చర్యం వేసింది.

కామాక్షియిల్లు కాదనుకున్నాడు. సత్యమూర్తికి శేషు చిరపరచితుడు. ప్రతిదినం యిద్దరూ యెక్కడో ఒకదగ్గర కలుస్తూనేవుండేవారు.

"ఏమండీ అలా నిలుచున్నారేం? లోనికి రావచ్చు మీగురించే కాబోలు కామాక్షి యెదురు చూస్తోంది. ఎవరో అనుకున్నాను" అన్నాడు.

శేషుకి ఆశ్చర్యం కలిగింది. కుర్చీలో కూర్చొ మన్నాడు. కూర్చున్నాడు.

"అమ్మా కామాక్షీ! అదిగో, శేషగిరిరావు వచ్చేరు." అని పిలవగానే కామాక్షి వచ్చింది.

"ఎవరో అనుకున్నాను. ఈయన నా చిర పరిచితుడు" అని తన పరిచయాన్ని తెలియ జేసేడు.

శేషు ఆశ్చర్యపడ్డాడు.

"అంతేనండి అప్పుడప్పుడు జీవితంలో యీ లాంటి సంఘటనలు జరుగుతుంటాయ్" అంది యెదురు కుర్చీలో కూర్చొని.

కొంతవరకు సత్యమూర్తి వారి మాటల్లో మాటలు కలిపి తరువాత పనుందని వెళ్లిపోయేడు.

అప్పటినుండి శేషు ప్రతిదినం కలసివచ్చి వెళ్లి పోతూండేవాడు. ఆమె వినయవిధేయతలు, సంస్కృతి అన్నింటికి మించిన ఆమె యవ్వన విలాసం మేళవించి అతన్ని సమ్మోహితుడిని చేశాయి.

సత్యమూర్తి మాటల్లో శేషు వివాహవిషయమై తెలియజేయడం మూలాన్ని శేషుకు కామాక్షే ప్రపంచం అయింది. అదోలాంటి ఆత్మీయభావం ఆమెకూ కలిగింది. ఇది కేవలం స్నేహరూపంగానే వుంది.

తరచు శేషు కలయిక చేత సత్యమూర్తిభార్యకు అతనిపై మంచిభావం కలిగింది. అతను అవివాహితుడవటం మూలాన్ని ఒకే ఆఫీసులో పని చేస్తూండటంవలన కామాక్షిని యిచ్చి పెళ్లి చేస్తే యీడూజోడుగా వుంటుందని భావించి సత్యమూర్తితో చెప్పింది. సత్యమూర్తికూడ కాదన లేక పోయేడు.

* * *

తన పుట్టినరోజున కామాక్షి కొందరు స్నేహితులను విందుకు ఆహ్వానించింది. వచ్చినవారిలో శేషు, సత్యంకూడ వున్నారు. సత్యం విద్యా వంతుడే కాకుండా మంచి రచయిత. కామాక్షికి సాహిత్యం అంటే మంచి అభిలాష. అందరికథలతోపాటు సత్యం కథానికలు చూస్తూంటుంది. సత్యం పాఠకులదృష్టిలో మంచి రచయితగా యెన్నికైనా, ఆమె కంతగా నచ్చలేదు. ఇది కేవలం వ్యక్తిపై యుండే ప్రేమభావంమ్మాత్రమే.

కామాక్షికి వివాహం ఒక తీరని సమస్యయై కూర్చుంది. ఇటు తనను అమితంగా ప్రేమించి తన అవసరాలను తీర్చేవారిని వివాహమాడటమూ లేక ఆమె తల్లి తండ్రులు నిర్ణయించుకున్న వానిని వివాహమాడటమూ అనేది వేధిస్తోంది.

ఆమెను శేషుకి యిచ్చి వివాహం చేయాలనే పట్టుదల సత్యమూర్తి భార్యకు వుంది. ఒకనాడు కామాక్షి యింట్లో లేనిసమయంలో శేషు వచ్చేడు. అదే సమయం అని ఆ మాటలు యీ మాటలాడి వివాహ విషయంలోకి దింపి "నీకే దైన మేనరికం వుందా?" అని ప్రశ్నించింది. తాను కోరింది ముందుగా ఆమె అడిగినందుకు సంతోషించి "అదేనండి మా మేనమామ కూతురు వుందని" చెప్తూ "అయినా నాకు యేమాత్రం యిష్టంలేదని" కామాక్షితనది కాకపోతుందనే భయంతో చెప్పేడు.

"కామాక్షి నీవు ఒకే ఆఫీసులో పనిచేస్తుండటం యిద్దరికి యీడూజోడుగావుందికాబట్టి దాన్నిచ్చి పెళ్లిచేయాలని వుంది. ఆతరువాత యిద్దరు మా యింట్లో వుండవచ్చని తన అభిప్రాయాల్ని స్పష్టంగా చెప్పేసింది. శేషుకు తను వాంఛించిన యువతితో వివాహం జరుగుతుందని సంతోషించి "వచ్చే ఆదివారం మావూరు వెళ్లి మా అమ్మను ఒప్పించి మీకు తెలియజేస్తా" నన్నాడు. ఇంకెవరి గురించి చూడకూడదనే భావంతో "ఏదో వేగంగా తేల్చేయ్ నాయనా" అంది ఆశతో.

రాత్రి కూతురుతో యీ విషయాల్ని తెలియ పర్చింది తల్లి. కాని ఆమెకు యేదీ చెవికెక్కడం లేదు.

ఆదివారం అనుకున్నట్లే శేషు యింటికి వెళ్లేడు. అంతకుముందే సూచా వాచా తల్లి తండ్రులకు శేషు సంగతులు తెలిసి వచ్చిరావడంతో దూయబట్టుకున్నారు. అతను అనుకున్నది తారుమారైందనుకున్నాడు. "ఏంరా బాబూ బంగారంలాంటి మేనరికాన్ని యింట్లో పెట్టుకొని ఏదో కిరస్తానీ చదువు చదివి వుద్యోగం చేస్తున్న దాన్ని పెళ్ళాడ్తాననటావేంటిరి? అంది తల్లి.

శేషు తన అభీష్టాన్ని తెలియపర్చేడు.

"అలా కాదు. ఉద్యోగంలేదు సద్యోగంలేదు. నీవు యెక్కడకువెళ్లడానికి వీల్లేదు. ఒక్కగాని ఒక్కడవు ఈ ఆస్తి యెవరు తినాలి? అదీగాక

నీ మేనమామ కొంత పొలాన్ని యిస్తున్నాడు. ఇక్కడేవుండు" అని బోధించింది. ఆ బోధనలు అతని చెవికి సోకడంలేదు. ఎటుచూసినా కామాక్షి ప్రతిబింబించింది.

"అది పనికిరాద"న్నాడు ధైర్యంగా.

ఇక్కడే ఉండిపోవాలి. రేపే నీ వుద్యోగానికి స్వస్తి చెప్పేయని పట్టుపట్టింది తల్లి.

చిన్ననాటినుండి పెంచి పెద్దవానిగా చేసిన తల్లిదండ్రులు ముఖ్యమా? మధ్యవచ్చి ఆకర్షింపబడిన కామాక్షి ముఖ్యమా? ఏనాటివో పిచ్చి నమ్మకాలతో జీవితాన్ని నాశనం చేసుకోమంటారే? గాని, సుహృదయమైన కామాక్షివైపు మొగ్గరు. కామాక్షి హృదయం తెలిసినవారెవరూ ఆమెను కాదనలేరు. అయినా తల్లి బలవంతం మూలాన్ని తన స్వాతంత్ర్యాన్ని మట్టిపాలుచేయవలసివస్తోంది. మేనమామ కూతుర్ని చేసుకోకపోతే ఏ నుయ్యోగొయ్యో చూసుకుంటానంది తల్లి. కామాక్షివల్ల కన్నతల్లిని ఆత్మహత్యపాలు కావించటమా అని యెన్నో ఊహలు రాత్రంతా అతని బుర్రలో తిరిగేయ్. తెల్లవారింది. రాత్రంతా నిద్దరలేక కళ్లు యెఱ్ఱబారినై.

"శేషూ తొందరగా కాలకృత్యాలు తీర్చుకొని కాఫీకిరా నాయనా" అంది.

కాఫీ తీసుకున్నాడు. చేతి సంచీలో బట్టలు సర్దుతున్నాడు.

"అప్పుడే యెక్కడికి ప్రయాణం?" అంది సంచీ విదిలిస్తూ తల్లి.

"పట్టణానికి ఉద్యోగంలో చేరా"లన్నాడు.

"నీ వుద్యోగంవద్దూ ఆర్జనావద్దు ఆపనికి రాజీనామా యిచ్చి యిక్కడే పొలం చూసుకో. మీ నాన్న పెద్దవారైనారు," అని భీష్మించుకు కూర్చొంది. శేషుకు యెటూ పాలుపోలేదు.

కామాక్షి ఆఫీసునుండి యింటికి రాగానే శేషుగురించి తల్లి ప్రశ్నించింది. "తను రాలేదని యేదో ఆటంకం వచ్చిందని సెలవు పొడిగించే" డంది

ఆ రాత్రి కామాక్షికి నిద్రరాలేదు. శేషు పరిస్థితులు కలవరపెడ్తున్నాయ్. కలసొచ్చిన మేనరికాన్ని వదలి వుద్యోగం చేస్తున్న తను వివాహం చేసుకోడానికి వాని తల్లిదండ్రులు ఒప్పుకుంటారా? తను అన్నాడేగాని తీరా వివాహం చేసుకుంటే తెలిసినవారు బంధువులు యేమనుకుంటారు? వ్యామోహంతో పెండ్లిచేసుకున్నారని నిందిస్తారు. ఒకవేళ పెండ్లాడినా శేషూ మా యింట్లో వుంటాడా? తనతోకూడ వుద్యోగం ఒకే ఆఫీసులో పనిచేయనిస్తాడా? అలా యెన్నటికిని జరగదు. మాగురించి వాని తల్లిదండ్రులను వదలిస్తే లోకం యేమనుకుంటుంది? వివాహానంతరం ఉద్యోగం విడిచి తనతోగూడ రమ్మనమంటే తన కుటుంబ విషయం యేంగాను. తండ్రికూడా రిటైరయినారు. ఈలాంటి పరిస్థితుల్లో శేషును వివాహమాడకపోవడమే ఉత్తమమని నిర్ధారించుకుంది. ఆ విషయం తల్లిదండ్రులతో చెప్పగానే వారికి కష్టం కలిగింది.

ఆమె ఆఫీసుకు వెళ్లగానే టేబిల్ మీద పసుపు రంగు కవరు వుంది. తన పరిచితులకు వివాహం అనుకుని శుభలేఖ తెరిచింది. ఆశ్చర్యపడలేదు. ఆమె అనుకున్నట్టే జరిగింది. శేషుకు రాజామణికి 15 వ తారీఖున వివాహమని. ఆఫీసు మేనేజరు ఆమెను పిలచి శేషు వుద్యోగానికి రాజీనామా లేఖ పంపేడని అందుతో శుభలేఖకూడ పంపేడని తెలియపరచేరు.

సాయంత్రం కామాక్షిని చూడగానే తల్లిదండ్రులకు యేదో సంశయం కలిగింది. ఏవేవో మాటలు చెప్పి శేషు విషయమై ప్రశ్నించగా టేబిల్‌పై పడవేసిన శుభలేఖ అందించింది. వారికి మేరలేని ఆశ్చర్యం కలిగింది. "ఇక్కడ ఎన్ని మాటలు చెప్పేడే" అంది తల్లి ఉక్రోషంతో.

"నేచెప్పేను కాదమ్మ! అది లాభంలేదని."

"అవునుతల్లీ నీవు చెప్పింది నిజమే అయితే మా బాధ వేరమ్మా" అంది తల్లి. అనుకోని విషయాలు జీవితంలో జరగటం మూలాన్ని మన పరిస్థితులు తారుమారుగా వున్నాయ్‌అంది.

అప్పుడే యింటి గడపలెక్కివస్తున్న సత్యానికి యీ మాటలు వినబడ్డాయ్. "అవునండి ఖర్మ అంటే యిదేనండి. ఎంతటివారికైనా పరిస్థితులు సుముఖంగా వున్నా చివరికి అదృష్టం—బాగుండకపోతే అవి యెదురుతిరుగుతాయ్" అన్నాడు వేదాంతిలా. తలుపు తెరచుకొని లోనికి ప్రవేసిస్తూ.

శేషు వివాహంనాటికి చేరేలా అభివందనాలతో కొన్ని బహుమతులు పంపింది కామాక్షి.

సత్యం మాటలు కామాక్షి హృదయానికి నాటు కున్నయ్.

"అవును నాయనా నీమాట నిజమే. అయి నా యిన్ని మాటలు చెప్పి యింత మోసగిస్తారని యెవరనుకుంటారు?" అంది విచారంతో తల్లి.

"ఏం కామాక్షీ! జీవితం అంటే యింతే కదూ! గొఱ్ఱె కసాయివాడినే నమ్మినట్లు అమాయకులు మోసగాళ్లను హెచ్చుగా నమ్ముతారు." అన్నాడు కూర్చీలో కూలబడుతూ.

"అయినా అందుకు నీవంతగా విచారించ నవసరంలేదు. ఇది లోక సహజం. మానవ జీవితంలో యీలాంటి సంఘటనలు యెన్నో జరుగుతాయ్. గత జల సేతుబంధనం" అన్నాడు.

"ఇంక గడచినదానికోసం కన్నీరు కార్చడం కన్న తెలివితక్కువ వేరే లేదు." అన్నాడు తన కున్న సాహిత్య జ్ఞానంతో.

తన తప్పు తెలుసుకున్న కామాక్షికి జవాబు చెప్పే శక్తి లేక బొటబొట కన్నీరు కార్చి సిగ్గుతో తలవంచుకుంది.

ఆ మెలోని మార్పును సత్యం గ్రహించి, స్తబ్ధుడై యెదురుగుండా మామిడిచెట్టువైపు చూస్తూ నుంచున్నాడు.

---

నిత్యజీవితంలో విజ్ఞానం

# దివ్య రక్ష

## గుంటుపల్లి రాధాకృష్ణమూర్తి

వరదలు మహోగ్రాటోపంతో వచ్చి మనుష్యులను జలగర్భంలోకి తీసుకుపోతాయి. కరువులు వికటాట్టహాసంతో మానవజాతిని ముట్టడించి హాత మార్చిపోతాయి. రోగాలు "ఎపిడెమిక్" రూపంలో వచ్చి లక్షలాది ప్రజలను ఆహుతి చేసుకుంటాయి. ఈ మధ్య అణుశక్తి మనిషి ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకు కూర్చున్నది.

ఈ అవాంతరాలనుంచి మనిషికి మోక్షంలేదా అంటే దృఢసంకల్పం ఉంటే మార్గాలకు కొదవే లేదు అని చెప్పాలి. మన దేశంలో అందరూ వేదాంతులే. యౌవనం, బలం, ధనం ఉన్నంత కాలం మనిషి అహంభావంతో వర్తిస్తాడు. కాటికి కాళ్లు చాచినప్పుడు భగవద్గీత ఆరంభిస్తాడు, "వృద్ధనారీ పతివ్రత" అన్నట్లు జీవితం అంటే ఒకనిర్లక్ష్యభావం"శివుడిఆజ్ఞ లేనిది చీమ అయినా కుట్టదు" అంటారు మన కర్మ ఎలాగుంటే అలా జరుగుతుంది అని వైరాగ్యం.

ఏమండీ మన దేశంలో ఎన్నడైనా బాగున్న మనిషి డాక్టరుదగ్గరికి వెళ్ళటం చూశారూ? పైగా దుండుముక్కలా ఉన్న మనిషి డాక్టరు దగ్గరికి వెళ్తే మనం ఎగతాళి చేస్తాంకూడా. అలాగని మనుష్యులందరూ డాక్టర్ల దగ్గరికి పరుగెత్తాలని కాదు. ప్రతీ మనిషీలోపల ఏద్లో జబ్బు ఉన్నదని అనుకోవాలనీ కాదు. మనిషి పైకి బాగున్నట్లు కనపడినా, ఒక్కొక్కప్పుడు ఏదైనా జబ్బు తొలిదశలలో ఉంటే ఉండవచ్చు. లేకపోతే, కళ్ళజబ్బు ఉండవచ్చు. కాకపోతే విట మిన్లలోపాన్ని సూచించే లక్షణాలు కొన్ని కనపడవచ్చు. ఇటువంటివి తెలుసుకుని ముందుగానే జాగ్రత్త పడడానికి హెల్త్ చెకప్ చాలా అవసరం. మాట వరసకి, క్షయరోగం ఉన్నదా, అది ఎన్నోరోజులు లోలోపలే దాగి, వృద్ధి పొందుతుంది. క్షయరోగుల బాధలు ఇన్నీఅన్నీ కావు గదా! మనిషి ఉద్యోగం చెయ్యలేడు. చెయ్య గలిగినా, క్షయరోగి అని తెలిస్తే ఉద్యోగం చెయ్యనివ్వరు. మరి భార్యాబిడ్డల గతి ఏం కావాలి? ముందుగానే తెలుసుకుని, నయం చేసుకోటానికే హెల్త్ చెకప్, మాస్ ఎక్స్‌రే వంటివి ఉపయోగ పడతాయి.

మనలాంటి అశ్రద్ధమనుష్యులను మానేకాబోలు, ప్రకృతి రోగాలు రాకుండా కాపాడుకునే శక్తిని మనలోనే ఇమిడ్చింది. మనిషి రాళ్ళు తిని హరించుకోవాలి అంటారు కదూ? రాళ్లమాట ఎలాగున్నా, విషక్రిములను మాత్రం మింగి హరించుకోగలడు, గళంలో గరళాన్ని ఇముడ్చుకున్న శివుడిలా.